# పట్టాలు తప్పి నదిలో పడిపోయిన రైలు బోగీలు.. 70 మందికి గాయాలు

న్యూఢిల్లీ, జూన్ 27 : రష్యా లో రైలు ప్రమాదం చోటు చేసుకుంది. ఫార్ నార్త్‌లో ఓ ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పి నదిలో పడిపోయింది. ఈ ఘటనలో సుమారు 70 మంది ప్రయాణికులు గాయపడ్డారు.స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. రైలు వోర్కుటా నగరం నుంచి ఆర్కిటిక్ సర్కిల్ మీదుగా.. దేశంలోని దక్షిణాన నల్ల సముద్రంలోని నోవోరోసిస్క్ నౌకాశ్రయానికి వెళ్తోంది. కోమి రిపబ్లిక్‌లోని ఇంటా అనే చిన్న పట్టణం సమీపంలోకి రాగానే రైలు పట్టాలు తప్పింది. దీంతో తొమ్మిది బోగీలు కోమి నదిలోకి పడిపోయాయి. ఆ సమయంలో ట్రైన్‌లో 215 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో 70 మంది గాయపడినట్లు తెలిసింది. క్షతగాత్రుల్లో ఏడుగురికి తీవ్రమైన గాయాలైనట్లు స్థానిక మీడియా నివేదించింది.అయితే, ప్రమాద సమయంలో నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని పేర్కొంది. రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కోమి (ఐనీఎతి) రీజియన్‌లో ఇటీవలే కురిసిన వర్షాలకు సంభవించిన వరదల కారణంగా రైలు పట్టాలు దెబ్బతిన్నాయని తెలిపింది. తాజా ప్రమాదానికి కారణమిదేనని ప్రాథమిక విచారణలో తేలినట్లు రష్యా మీడియా నివేదించింది. ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


**చురక**

పార్లమెంటులో నేడు
పటిష్ఠంగా ప్రతిపక్షం
ప్రజాస్వామ్య పరిరక్షణ
ప్రాధాన్యతే ఇక లక్ష్యం.

లుకలుకలు బెకబెకలు
లేకుంటెనే అది సాధ్యం
సమైక్యంగా వినిపిస్తెనె
సమర హోరు వాయిద్యం



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ శుక్రవారం 28-6-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:257 పేజీలు:6 వెల: రూ.1/-


# అనుభవజ్ఞులైన మంత్రుల సహకారంతో అద్భుతంగా పాలన

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కితాబు

న్యూఢిల్లీ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అనుభవజ్ఞులైన మంత్రుల సహకారంతో అద్భుతంగా పాలన సాగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కితాబు ఇచ్చారు.. కేంద్రంలో కొత్త ప్రభుత్వానికి రాష్ట్ర వినతులు ఇచ్చామని,ఎలాంటి భేషజాలకు వెళ్లకుండా కేంద్ర పెద్దలను కలుస్తున్నామన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ తప్పక నెరవేరుస్తున్నామని, శాంతిభద్రతలకు ఎక్కడా విఘాతం కలుగకుండా పాలన సాగిస్తున్నామని, చిన్న చిన్న గొడవలు లేకుండా ఎన్నికలు నిర్వహించామన్నారు. బిఆర్ఎస్‌ను కాపాడేందుకు కొంత మంది తప్పుడు వార్తలు రాస్తున్నారని, కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నాయని రేవంత్ రెడ్డి ఆగ్రహంవ్యక్తం చేశారు. కెసిఆర్ మతితప్పి మాట్లాడుతున్నారని, అమరవీరుల స్థూపం దగ్గరకు వచ్చి కెసిఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వచ్చిన నెలరోజు లకే ప్రభుత్వాన్ని పడగొడుతామని కెసిఆర్ అన్నారని, బిఆర్ఎస్, బిజెపి కలిసి ప్రభుత్వాన్ని పడగొడుతామని అంటున్నాయని, పార్లమెంట్ ఎన్నికల లో బిఆర్ఎస్ ఓట్లు బిజెపికి వేసి కాంగ్రెస్ ను ఓడించాలని చూశారని దుయ్యబట్టారు. ప్రభుత్వంలో ఏ శాఖ ఖాళీగా లేదని, అన్ని శాఖలకు మంత్రులు ఉన్నారని, ప్రస్తుతం విద్యాశాఖను తానే ఫుల్ టైమ్‌గా చూస్తున్నామని, తన ఆధ్వర్యంలో విద్యాశాఖ సక్సెస్‌గా పరీక్షలు నిర్వహించిందని, విద్యాశాఖ మీద ఎన్నో సమీక్షలు నిర్వహించామన్నారు.

రైతు రుణమాఫీ, రైతు బంధు విషయంలో ఎంఎల్ సి జీవన్‌రెడ్డి సలహాలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రేవంత్ రెడ్డితో జీవన్ రెడ్డి సమావేశమైన సందర్భంగా సిఎం మాట్లాడారు. జగిత్యాల ఎంఎల్‌ఎ సంజయ్ చేరిక విషయంలో కొంత గందరగోళం ఏర్పడిందని, మంత్రి శ్రీధర్‌బాబు సమన్వయంతో సమస్య పరిష్కారమైందని, జగిత్యాల అభివృద్ధి కోసం సంజయ్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారని, జగిత్యాల నియోజకవర్గంతో పాటు రైతుల కోసం జీవన్ రెడ్డి కొట్లాడారని ప్రశంసించారు.

# బావిలో పూడికతీస్తుండగా మట్టి దిబ్బలు కూలి రైతు మృతి

జోగులాంబ గద్వాల, జూన్ 27 : రైతు పొలంలోని పూడుకుపోయిన పురాతన వ్యవసాయ బావిని మళ్లీ తవ్వుతుం డగా.. ఓ రైతుపై మట్టిదిబ్బలు కూలి మృతి చెందిన సంఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు.. కేటీదొడ్డి మండలం ఇర్కిచేడు గ్రామానికి చెందిన రైతు జనార్దన్‌రెడ్డి పొలంలో పురాతన వ్యవసాయ బావి పూడుకుపోయింది. అయితే గురువారం జేసీబీ సాయంతో పూడికతీత పనులు ప్రారంభించాడు. బావి గుంతలోంచి ఇసుక పెద్దమొత్తంలో వస్తుండడంతో పరిశీలించేందుకు జనార్దన్‌రెడ్డి సమీప పొలానికి చెందిన రైతు జయరాం(35) బావిలోకి దిగాడు. ఈ క్రమంలో ఇసుక, మట్టిదిబ్బలు ఒక్కసారిగా ఆయనపై కూలిపడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. జేసీబీ రప్పించి మూడు గంటల పాటు శ్రమించి మట్టి దిబ్బలను తీయించగా అప్పటికే అతడు మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమి త్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# ప్రపంచ వృద్ధిలో భారత్ 15 శాతం భాగస్వామ్యం అవుతోంది

## -ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ ప్రసంగం



న్యూ ఢిల్లీ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ : ప్రపంచ వృద్ధిలో భారత్ 15 శాతం భాగస్వామ్యం అవుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ తెలిపారు. ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ ప్రసంగించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఆమె అభినందనలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని గెలిచి సభకు ఎన్నికయ్యారని, దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తారని ఆశిస్తున్నామన్నారు. ఆర్థిక భరోసా కోసం నేరుగా రైతుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నామని, చిన్న, సన్నకారు రైతుల కోసం పిఎం సమ్మాన్ నిధి తీసుకొచ్చామని, ప్రజా సంక్షేమ కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చామని స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయని, గ్రీన్ ఎనర్జీ సాధన దిశగా ప్రభుత్వం పని చేస్తోందని, ఆర్గానిక్ ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెరిగిందని, ప్రపంచ వ్యాప్త డిమాండ్ మేరకు భారత్ ఉత్పత్తులను అందిస్తోందన్నారు. కరోనాలాంటి కష్టకాలాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, ఆయుష్మాన్ భారత్‌తో దేశ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నామని, ఆరోగ్య రంగంలో భారత్ అగ్రగామిగా ఉందని ఆమె వివరించారు. భారత్ వేగంగా పురోభివృద్ధి సాధిస్తోందని. గ్రామీణ ప్రాంతాల్లో వేగంగా రోడ్ల విస్తరణ జరుగుతోందని, పౌరవిమానయాన రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చామని, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని, పదేళ్లుగా అభివృద్ధి కోసం కేంద్రం పని చేస్తోందని ద్రౌపది ప్రశంసించారు. భారత ఎన్నికలపై ప్రపంచమంతా చర్చ జరిగిందని, 2024 సార్వత్రిక ఎన్నికల ఎంతో ప్రత్యేకమైని, జమ్ము కశ్మీర్‌లో పెద్ద ఎత్తున ప్రజలు ఓటేశారని కొనియాడారు.

# రెండు లక్షల రుణమాఫీ చేసి చూపిస్తాం- ఉప ముఖ్యమంత్రి భట్టి

**ఆగస్టు కాదు అంతకన్నా ముందే చేసి చూపిస్తాం.. రైతు రుణమాఫీని ఎవరూ ఆపలేరు**

**ప్రజాభిప్రాయం సేకరించి, విధి విధానాలు రూపొందించి, అసెంబ్లీలో చర్చించి రైతు భరోసా అమలు చేస్తాం**

**గత పాలకులు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి 42వేల కోట్లు అప్పు తెచ్చి మిషన్ భగీరథ చేపట్టారు..**

**రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించారు.. అయినా ఇంటింటికి తాగునీటిని ఇవ్వలేకపోయారు**

**ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేరుస్తాం**

**రాష్ట్ర ప్రజల డబ్బుకు జవాబుదారీగా ఉంటాం**

**గత పదేళ్లు పాలించిన వారు రాష్ట్ర సంపదను దోపిడీ చేసి, ఎవరికి పడితే వారికి పంచారు**

**రూ.7లక్షల కోట్ల అప్పు చేసి.. పారిపోయారు**

**రామగుండంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించేందుకు ప్రణాళికలు చేస్తున్నాం**

**త్వరలో శుభవార్త వింటారు**

**ప్రణాళికా బద్ధంగా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం**

**త్వరలో సీతారామ ప్రాజెక్టు నుంచి నీళ్లు పారిస్తం**

**పైసా పైసా పోగుచేసి సంపదను సృష్టిస్తాం.. ఆ సంపదను రాష్ట్ర ప్రజలకే పంచుతాం**

**కొత్తగూడెం పాల్వంచ రెండు పట్టణాలు కలిపి కార్పొరేషన్ ఏర్పాటు**

**స్థానికంగా ఐటీ హబ్ ఏర్పాటు చేసే ఆలోచనను పరిశీలిస్తాం**

**డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క**

ఖమ్మం, జూన్ 27 :కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు డబ్బులు ఇవ్వదు ఇవ్వదు అని ప్రచారం చేశారు, మేము ఒకేసారి 7,500 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశాం.. ఇప్పుడు రైతు రుణమాఫీ చేయరు.. చేయరు ..అని ప్రచారం చేస్తున్నారు.. ఇది ఇందిరమ్మ ప్రభుత్వం, ప్రజల ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీని చేసి చూపిస్తామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం కొత్తగూడెం పట్టణంలో తాగునీరు, రహదారులకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్ని రకాల ఆటంకాలు ఉన్నా.. రెండు లక్షల రైతు రుణమాఫీ అమలు చేసి చూపిస్తామని, ఆగస్టు కాదు అంతకన్నా ముందే చేసి చూపిస్తాం, ఈ కార్యక్రమాన్ని ఎవరు ఆపలేరని ఆయన అన్నారు.





ఇక రైతు భరోసా విషయానికొస్తే ఎవరికి ఇవ్వాలి, ఎలా పంపిణీ చేయాలి అన్నది ప్రజల నుంచి అభిప్రాయం సేకరించి, విధి విధానాలు రూపొందించి, అసెంబ్లీలో చర్చకు పెట్టి చట్టం చేసి కచ్చితంగా రైతు భరోసా ఈ రాష్ట్ర రైతులకు అందజేస్తామన్నారు. ప్రజల సొమ్ము నిరుపయోగం కాకుండా, ప్రజల డబ్బుకు జవాబుదారీగా ఉంటావన్నారు. గత పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన నాయకులు ఖజానాను దోపిడీ చేశారు, ఎవరికి పడితే వారికి పంచారు.. 7 లక్షల కోట్ల అప్పు చేసి పారిపోయారని విమర్శించారు.

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం మాత్రం రూపాయి రూపాయి పోగు చేసి అర్థవంతంగా ప్రభుత్వ నిధులను ఖర్చు చేస్తుందన్నారు. సంపదను సృష్టిస్తాం.. ఆ సంపదను రాష్ట్ర ప్రజలకు పంచుతామని ధీమా వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పేరుతో రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి గత పదేళ్ళు పాలించిన వారు 42వేల కోట్లు అప్పు తెచ్చారు,

అయినా ఇంటింటికి తాగునీరు రాని దుస్థితి నెలకొందని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. కొత్తగూడెం పట్టణంలో తాగునీటి సరఫరాకు 150 కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం వచ్చిందని, నల్గొండ జిల్లాలోని ఆలేరు నియోజకవర్గానికి 150కోట్లతో తాగునీరు అందించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. కొత్తగూడెం, పాల్వంచ రెండు పట్టణాలను కలుపుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు అవకాశం ఉంటే తప్పకుండా మంత్రివర్గం దృష్టికి తీసుకువెళ్లి ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

కొత్తగూడెం పట్టణానికి ఒకటే దారి ఉంది.. ట్రాఫిక్ జామ్ అయితే ఇబ్బందులు ఏర్పడతాయి? ఈ సమస్య పరిష్కారానికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి గానూ స్థల సేకరణ కూడా పూర్తయిందని తెలిపారు. ఆర్ఓబీ నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిధులు మంజూరు చేశారని, రాష్ట్రవ్యాప్తంగా ఆర్వోబీల నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ మంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. కావలసినంత స్థలం, నీరు, బొగ్గు అందుబాటులో ఉన్నందున రామగుండంలో సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం,

త్వరలోనే శుభవార్త వింటారని డిప్యూటీ సీఎం తెలిపారు.కొత్తగూడెంలో ఐటీ హబ్ నిర్మాణానికి కావలసిన స్థలం ఏర్పాటు చేసేందుకు సింగరేణి యాజమాన్యంతో చర్చిస్తానని, టైర్ టు సిటీ, పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం అభివృద్ధికి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడి ఐటి హబ్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత పాలకులు సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.9000 కోట్లు ఖర్చు చేసి ఒక ఎకరాకు కూడా నీరు ఇవ్వలేకపోయారని విమర్శించారు.

ఇందిరమ్మ ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల వివరాలన్నిటిని తెప్పించుకున్నాం,

ఆరు నెలల్లో పూర్తి చేయగలిగేవి ఏంటి, ఏడాదిలో, మూడు సంవత్సరాల కాలంలో, ఐదు సంవత్సరాల కాలంలో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించే అవకాశం ఉన్న అన్ని ప్రాజెక్టులను గుర్తించామని తెలిపారు.

వీటినీ ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసి సాగునీరందిస్తాం, త్వరలోనే సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీటిని పారిస్తామన్నారు. రూ.70 కోట్లతో వైరా ప్రాజెక్టుకు లింకు కెనాల్ ను అనుసంధానం చేస్తున్నట్లు వివరించారు.

## మంచినీటి సరఫరా అభివృద్ధి పథకంకు శంకుస్థాపన..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అమృత్ 2.0 124.48 కోట్ల నిధుల ద్వారా మంచినీటి సరపరా అభివృద్ధి పథకంకు శంకుస్థాపన చేసిన తెలంగాణ రాష్ట్ర గౌరవ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు తదితరులున్నారు.

# నేడు సీఎం రేవంత్ వరంగల్ పర్యటన.. మంత్రి కొండా సురేఖ సమీక్ష



హన్మకొండ, జూన్ 27(నేటినిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్రానికి రెండో రాజధానిగా వరంగల్ నగరాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కార్యకలాపాలు సాగిస్తున్నారని మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు చేశారు. రేపు (జూన్ 28న) సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటనకు వస్తున్నందున మంత్రి సురేఖ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు.

రేపు మధ్యాహ్నం ఒంటిగంటకు రేవంత్ రెడ్డి వరంగల్ టెక్స్ టైల్ పార్క్ చేరుకుంటారని తెలిపారు. వరంగల్‌లో పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పనపై అధికారులతో సీఎం సమీక్షిస్తారని తెలిపారు. వరంగల్‌లో నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కూడా రేవంత్ రెడ్డి సందర్శిస్తారని కొండా సురేఖ తెలిపారు.

అటు హన్మకొండ కలెక్టరెట్ పరిధిలో కూడా వివిధ పనులపై రేవంత్ రెడ్డి రివ్యూ చేస్తారని వెల్లడించారు. హన్మకొండ అభివృద్ధి పనులపై, వరంగల్ మాస్టర్ ప్లాన్ అంశంపై రేవంత్ రెడ్డి అధికారులతో చర్చిస్తారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు సొంత ఎజెండాతో చేసినదని.. దాన్ని మార్చాల్సి ఉందని అన్నారు.

మరో 3 నెలల కాలవ్యవధిలో వరంగల్ మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామని చెప్పారు. స్మార్ట్ సిటీ పనుల అంశంపై కూడా చర్చ ఉంటుందని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అంశం చర్చిస్తామని మంత్రి తెలిపారు.

రేపు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సీఎంకు నివేదించాల్సిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు.సీఎం పర్యటన నేపథ్యంలో ప్రొటోకాల్‌ను పర్యవేక్షించాలని, ఎలాంటి లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్లు సత్య శారదాదేవి, ప్రవీణ్య పాల్గొన్నారు.

# నేడు మధ్యాహ్నం 3 గంటలకు పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 27 :ఈ నెల 28న మధ్యాహ్నం 3 గంటలకు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ మేరకు ఎస్సెస్సీ బోర్డు అధికారులు అధికారికంగా ప్రకటించారు. పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలను ఈ వెబ్‌సైట్ bse.telangana.gov.in లో చూసుకోవచ్చు. వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు జూన్ 3వ తేదీ నుంచి జూన్ 13వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షల్ని నిర్వహించారు.

తెలంగాణ పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు ఈ ఏడాది ఏప్రిల్ 30న విడుదల చేసిన సంగతి తెలిసిందే. టెన్త్ వార్షిక ఫలితాల్లో 91.31 ఉత్తీర్ణత శాతం నమోదైంది. బాలికలు 93.23 శాతం ఉత్తీర్ణత, బాలురు 89.42 శాతం ఉత్తీర్ణత సాధించారు. 3,927 స్కూల్స్‌లో 100 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఆరు స్కూల్స్‌లో జీరో ఉత్తీర్ణత శాతం నమోదైంది. గతేడాది 89.60 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈ ఏడాది 91.31 శాతానికి పెరిగింది. మొత్తం 5,05,813 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 4,91,862 మంది విద్యార్థులు పాస్ అయ్యారు.

ఈ ఏడాది టెన్త్ వార్షిక పరీక్షలను మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించారు. వీటికి 5,08, 385 విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 2,57,952 మంది బాలురు, 2,50,433 మంది బాలికలు ఉన్నారు.

# ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం:అదనపు కలెక్టర్ డి.మధుసూదన్



ఖమ్మం, జూన్ 27 :(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేసినట్లు అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ధరణి దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...ధరణి పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

ప్రతిరోజు పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి రోజువారి లక్ష్యం ఏర్పరచుకొని తదనుగుణంగా కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు. తహాశీల్దార్లు, ఆర్డీవోలు తమ తమ లాగిన్ లో ఉన్న ఫైళ్ల పరిశీలన త్వరితగతిన పూర్తికి ఆదేశాలు ఇచ్చి రోజువారి పరిష్కార పర్యవేక్షణ చేస్తున్నట్లు ఆయన అన్నారు. తహాశీల్దార్ల పరిశీలన తర్వాత ఆర్డీవోల లాగిన్, అక్కడి నుండి అదనపు కలెక్టర్ లాగిన్ కి వస్తాయని ఫిజికల్ ఫైళ్ల పరిశీలన చేసి కలెక్టర్ కు పరిష్కారానికి ఫార్వార్డ్ చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.

**నేటి కందం- నేటికీ అందం**

మామక విషయచయంబును
క్షేమంబుగ నుంచి మిగుల శ్రేయము నిడగన్
బీమా పథకమ్ములపై
ప్రేమాస్పదులకు సతతము వివరింపవలెన్
(జూన్ 28 బీమా అవగాహనా దినం..)



-రాధశ్రీ
సెల్:9494481210




# ప్రపంచ పట్టణాల సూచికలో మనమెక్కడ..!

ఆధునిక డిజిటల్ ఏఐ యుగంలోఆకరషణీయ ఉద్యోగ ఉపాధులను వెతుక్కుంటూ గ్రామీణ యువత పట్టణాలకు చేరడం వేగంగా జరుగుతోంది. పల్లె యువత ఆర్థికంగా లాభం లేని వ్యవసాయ ఆధార వృత్తులను వదిలి ఎర్ర బస్సెక్కి నగరాలకు చేరడం, ఏదో ఒక పనిని చూసుకొని బతుకు పోరు సాగించడం చూస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా పట్టణీకరణ క్రమంగా, వేగంగా పెరగడంతో అంతే వడిగా సమస్యలు కూడా నగరవాసులకు నరకం చూపిస్తున్నాయని ఇటీవల ఆక్స్‌ఫర్డ్ ఎకనమిక్స్ విభాగం విడుదల చేసిన "ప్రపంచ పట్టణాల సూచిక లేదా గ్లోబల్ సిటీస్ ఇండెక్స్" అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దాదాపు 1,000 ప్రపంచ నగరాల 'గ్లోబల్ సిటీస్ ఇండెక్స్' అధ్యయనాలకు మూలాలుగా నగరాల ఆర్థిక ప్రగతి, మానవ వనరులు, పర్యావరణం, జీవన నాణ్యత, ప్రభుత్వ పరిపాలనలకు సంబంధించిన 27 ఇండికేటర్స్‌ను తీసుకున్నారు.

**ప్రపంచ పట్టణాల్లో అత్యంత వేగంగా జీడీపీ పెరుగుతున్న 10 భారత నగరాలు:**

2019 - 35 మధ్య కాలంలో ప్రపంచ నగరాలన్నింటిలో అత్యంత వేగంగా పెరుగుతున్న భారత్‌కు చెందిన 10 నగరాలు ముందు వరుసలో ఉండడం ప్రధాన అంశంగా పేర్కొంటున్నారు. ప్రతి ఏట వేగంగా పెరుగుతున్న 20 ప్రపంచ నగరాల జాబితాలో భారత్‌కు చెందిన 17 నగరాలు ముందు వరుసలో ఉండడం గమనార్హం. అత్యంత వేగంగా 9.17 శాతం జిడీపీ పెరుగుదల చూపిన గుజరాత్‌లోని వస్త్ర పరిశ్రమలతో పాటు వజ్రాల వాణిజ్య పట్టణమైన సూరత్ ప్రపంచ నగరాల జాబితాలో ప్రథమ స్థానం దక్కించుకుంది. దీనితో పాటు తొలి 10 స్థానాల్లో భారతీయ నగరాలు చేరాయని నివేదిక స్పష్టం చేస్తున్నది.

ఈ జాబితాలో సూరత్ (జిడిపీ వృద్ధి రేటు 9.17 శాతం), ఆగ్రా (8.58 శాతం), బెంగుళూరు (8.5 శాతం), హైదరాబాదు (8.47 శాతం), నాగపూర్ (8.41 శాతం), తిరుపూర్ (8.36 శాతం), రాజ్‌కోట్ (8.33 శాతం) తిరుచిరాపల్లి (8.29 శాతం), చెన్నై (8.17 శాతం), విజయవాడ (8.16 శాతం) లాంటి 10 నగరాలు తొలి 10 స్థానాలను దక్కించుకున్నాయి. ఆగ్రా నగరం పర్యాటకం, వస్త్ర పరిశ్రమలు, ఆటోమొబైల్స్ లాంటి అంశాలకు పేరుగాంచింది. ఏటికి పేరొందిన బెంగుళూరును సిలికాన్ వ్యాలీలా ఆఫ్ ఇండియాగా పిలుస్తున్నాం. ఐటీ, అంకుల్ సంస్థల హబ్‌గానే కాకుండా 'సిటీ ఆఫ్ పెరల్స్'గా హైదరాబాదుకు గుర్తింపు ఉన్నది. నాగపూర్‌లో దాదాపు 22,000 ఎంఎస్‌ఎంఈలు పనిచేస్తున్నాయి.

నిట్‌వేర్ ఇండస్ట్రీ హబ్‌గా తిరుప్పూర్, మాన్యుఫాక్చరింగ్, ఆటోమొబైల్ హబ్‌గా రాజ్‌కోట్, ఇండస్ట్రియల్ సిటీగా తిరుచురాపల్లి, ఆటోమొబైల్, ఫిలిం, ఐటీ హబ్‌గానే కాకుండా 'డెట్రాయిట్ ఆఫ్ ఇండియా'గా చెన్నై, పలు రకాలైన వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రంగా విజయవాడ నగరాలకు గుర్తింపు ఉన్నది.

**అత్యధిక ఆర్థిక వ్యవస్థలు కలిగిన 10 ప్రపంచ పట్టణాలు:**

అత్యధిక ఆర్థిక వ్య వస్థ (లార్జెస్ట్ అర్బన్ ఎకానమీ) కలిగిన ప్రపంచ నగరాల జాబితాలో న్యూయార్క్ ప్రథమ స్థానాన్ని నిలుపుకుంటూ వస్తున్నది. అత్యధిక ఆర్థిక వ్యవస్థ కలిగిన నగరాల్లో భారత నగరాలు వెనుకబడి ఉన్నట్లు స్పష్టం అవుతున్నది. ప్రపంచ పట్టణాల సగటు ఆర్థిక వృద్ధి 2.6 శాతంగా నిర్ధారించబడింది.

అత్యధిక ఆర్థిక వ్యవస్థ కలిగిన 10 ప్రపంచ పట్టణాల్లో న్యూయార్క్(యూఎస్), లండన్(యూకె), సాన్ జోస్ (యూఎస్), టోక్యో(జపాన్), పారిస్(ఫ్రాన్స్), సీటిల్ (యూఎస్), లాస్ ఎంజెలిస్ (యూఎస్), సాన్ ఫ్రాన్సిస్కో (యూఎస్), మెల్బర్న్(ఆస్ట్రేలియా), జూరిచ్(స్విస్) ముందు స్థానాలను దక్కించుకున్నాయి. ప్రపంచవ్యాప్త ప్రధాన 1,000 నగరాల ద్వారా 60 శాతం జిడిపీ వయద్ధి నమోదు అవుతున్నట్లు తెలుస్తున్నది. ఈ జాబితాలో యూఎస్‌కు చెందిన 5 పట్టణాలు ఉండడం విశేషం.

**మానవ వనరులు, క్వాలిటీ ఆఫ్ లైఫ్, పరిశుద్ధ పర్యావరణం, ప్రభుత్వ పాలన విభాగాలు:**

హ్యూమన్ క్యాపిటల్ (మానవ వనరులు) విభాగంలో లండన్ (యూకె), టోక్యో(జపాన్), రియాద్(సౌథీ), న్యూయార్క్ (యూఎస్), సియోల్(దక్షిణ కొరియా) నగరాలు తొలి ఐదు స్థానాలను దక్కించుతున్నాయి. జీవన నాణ్యత లేదా క్వాలిటీ ఆఫ్ లైఫ్ విభాగంలో గ్రెనోబుల్ (ఫ్రాన్స్), కాన్‌బెరా (ఆస్ట్రేలియా), బెర్న్(స్విస్), బెర్జెన్(నార్వే), బేసెల్(స్విస్) పట్టణాలు తొలి ఐదు స్థానాలను ఆక్రమించాయి.

పరిశుద్ధ పర్యావరణం కలిగిన ప్రపంచ నగరాల జాబితాలో సువా(ఫిజి), ఫోర్టలెజా(బ్రెజిల్), సాన్ జువా(పెర్టో రికో),నాటల్(బ్రెజిల్), వెల్లింగ్టన్(న్యూజిలాండ్) పట్టణాలు ఉన్నాయి. పారదర్శక, నిష్పాక్షిక ప్రభుత్వ పరిపాలన విభాగంలో న్యూజిలాండ్, డెన్మార్క్, ఫిన్‌లాండ్, నార్వే, స్వీడెన్ దేశాలు తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

భారత పట్టణాల్లో నేడు పర్యావరణ కాలుష్యం, జీవన నాణ్యత కొరవడడం, ప్రభుత్వ పాలన అవినీతి కోరల్లో చిక్కడం, మౌళిక వనరుల కొరత, అస్తవ్యస్త ప్రజారవాణ, రోడ్ల దుస్థితి, పలుచనైన హరిత వనాలు, ప్రణాళికా రహిత పట్టణీకరణ లాంటి పలు ప్రధాన సమస్యలు పట్టి పీడిస్తున్నాయని తెలుసుకొని ప్రభుత్వాలు, పట్టణ పౌర సమాజం తమ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# పెద్దిరెడ్డి కోటకు గండి.. పుంగనూరులో వైసీపీ ఖాళీ ..

## పసుపు చొక్కాల్లో చైర్మన్ తో 17 మంది కౌన్సిలర్లు



తిరుపతి,జూన్ 27 ::గత ప్రభుత్వ హయాంలో ఎదురు లేని మంత్రిగా పేరొందిన పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి కోట బీటలు వారుతోంది. రెండేళ్ల కిందట జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వై ఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా గెలుచుకున్న పుంగనూరు మున్సిపాలిటీ తెలుగుదేశం పరం కానున్నది. ఈరోజు ఇప్పటి వరకు పదవులే తప్ప అధికారం లేకపోవడంతో 17 మంది కౌన్సిలర్ల తో తెలుగు దేశం పార్టీ లో చేరనున్నట్టు పుంగనూరు మున్సిపల్ చైర్మన్ ప్రకటించారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగు దేశం అధినేత చంద్రబాబు, వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి నడుమ దశాబ్దాల నాటి రాజకీయ వైషమ్యాలు గత అయిదేళ్ల మధ్య కాలంలో పరాకాష్ట కు చేరింది. కుప్పం లో వరుసగా ఏడుసార్లు గెలుస్తూ వచ్చిన చంద్రబాబు ను ఈసారి ఓడించడానికి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి సర్వ శక్తులను వినియోగించారు. తాజా ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఘోర పరాజయం చెందడంతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో 11 చోట్ల తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. పొత్తులో భాగంగా ఒక చోట పోటీ చేసిన జనసేన అభ్యర్థి గెలవగా పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, అయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి మాత్రం గెలిచారు. ఈ నేపథ్యంలో అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వ బలంతో తెలుగుదేశం పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి వర్గ బలాన్ని తగ్గించే కృషి మొదలు పెట్టింది. రెండేళ్ల క్రితం పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి హయాంలో ఏకపక్షంగా జరిగిన ఎన్నికలలో వైసీపీ గెలిచిన స్థానిక సంస్థల పై దృష్టి సారించింది. గతంలో ప్రతిపక్ష పార్టీలు నామినేషన్లు కూడా వేయడానికి వీలులేని వాతావరణంలో వైసీపీ ఏకగ్రీవంగా గెలుచుకున్న మున్సిపాలిటీలు, మండలాలలో ఆకర్ష్ పథకం అమలు మొదలైంది. ఈ క్రమంలోనే పుంగ నూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ చల్లా బాబు నేతృత్వం లో తెలుగుదేశం పార్టీ లో చేరనున్నట్టు పుంగనూరు మునిసిపల్ చైర్మన్ హలీం బాషా ఈరోజు ప్రకటించారు. తనతో పాటు 11 మంది కౌన్సిలర్లు కూడా చేరుతారని చెప్పారు. ఈ సందర్భం గానే వైసీపీ ప్రభుత్వ హయాంలో తమకు పదవులు వచ్చినా అధికారాలు మాత్రం తమ చేతుల్లో లేనందున ప్రజలకు ఏమీ చేయలేక పోయామని, అందుకే తెలుగుదేశం పార్టీ లో త్వరలో చేరనున్నట్టు ప్రకటిం చారు. దీంతో 20 వార్డులున్న పుంగ నూరు మున్సిపాలిటీని వైసీపీ కోల్పోవడం ఖాయమవుతోంది. ఒక విధంగా పెద్దిరెడ్డి రామచం ద్రా రెడ్డి కేంద్ర స్థానం ఆనదగిన పుంగనూరు మున్సిపాలిటీ త్వరలో తెలుగుదేశం పార్టీ పరం కావడం లాంఛనమే అని స్పష్టం అవుతోంది. అసలే ఓటమి భారంతో కునారిల్లుతున్న వైసీపీ కి ముఖ్యంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పెద్ద దెబ్బే అని చెప్పాలి. ఇక ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్మించుకున్న పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి కోటలు బీటలు వారడం ఆయన ఇలాకాలోనే మొదలైందని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నేతలు అంటున్నారు.

# 'కోఫోర్జ్' ద్వారా 'సిగ్నిటీ' సంస్థలో నిర్దిష్ట ఈక్విటీ షేర్ల కొనుగోలుకు 'సీసిఐ' ఆమోదం

న్యూఢిల్లీ, జూన్ 27 :సిగ్నిటీ టెక్నాలజీస్ లిమిటెడ్ (సిగ్నిటీ) సంస్థలో నిర్దిష్ట ఈక్విటీ షేర్లను కోఫోర్జ్ లిమిటెడ్ (కోఫోర్జ్) సంస్థ కొనుగోలు చేసేందుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఆమోదం తెలిపింది.

ఈ ప్రతిపాదిత లావాదేవీ- సిగ్నిటీ సంస్థ నుంచి కోఫోర్జ్ సంస్థ 'ఫుల్లీ డైల్యూటెడ్' ప్రాతిపదికన కనీసం 50.21 శాతం గరిష్ఠంగా 54 శాతం దాకా షేర్లు కొనుగోలు చేయడానికి సంబంధించింది. ఈ లావాదేవీ (ప్రతిపాదిత సమ్మేళనం) 'సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (షేర్లు-టేకోవర్ల గణనీయ కొనుగోలు) నిబంధనలు-2011'కు అనుగుణంగా ప్రకటించిన తప్పనిసరి 'ఓపెన్ ఆఫర్' కింద కుదుర్చుకున్న షేర్ల కొనుగోలు ఒప్పందం అమలుకు సంబంధించినది.

'కోఫోర్జ్' ఒక పబ్లిక్ కంపెనీ కాగా, ఆ సంస్థ ఈక్విటీ షేర్లు 'నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా' లిమిటెడ్ (ఎన్ఎస్ఇ), బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ) రెండింటిలోనూ నమోదు చేయబడ్డాయి. 'కోఫోర్జ్'తోపాటు దాని అనుబంధ సంస్థలు భారతదేశంలో సమాచార సాంకేతికత (ఐటీ), ఐటీ ఆధారిత, దాని ఉప-విభాగాల సేవలు (ఐటిఇఎస్) అందించే వ్యాపారం చేస్తున్నాయి.

అలాగే సిగ్నిటీ కూడా ఒక పబ్లిక్ కంపెనీ కాగా, దాని ఈక్విటీ షేర్లు కూడా 'ఎన్ఎస్ఇ, బిఎస్ఇ' రెండింటలోనూ నమోదై ఉన్నాయి. అదేవిధంగా 'సిగ్నిటీ'తోపాటు దాని అనుబంధ సంస్థలు కూడా భారతదేశంలో సమాచార సాంకేతికత (ఐటీ), ఐటీ ఆధారిత, దాని ఉప-విభాగాల సేవలు (ఐటిఇఎస్) అందించే వ్యాపారం చేస్తున్నాయి.

# సీతారామ పంప్‌హౌస్ ట్రయల్ రన్ సక్సెస్ - పరవశించిన మంత్రి తుమ్మల



భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 27 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీ.జీ. కొత్తూరు వద్ద బుధవారం అర్ధరాత్రి సీతారామ ప్రాజెక్టు మొదటి లిఫ్ట్ ట్రయల్ రన్ ను ఇరిగేషన్ అధికారులు నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. గోదావరి జలాలు పరవళ్ళు తొక్కుతుండటంతో ఆయన ఒక్కసారిగా పరవశించిపోయారు. ఆనందంతో భూమాతకు సమస్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ ఖమ్మం జిల్లాలను సస్యశ్యామలం చేయాలన్న తన కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేయడం తన జీవిత ఆశయమని గతంలో ఎన్నోసార్లు చెప్పానని గుర్తు చేశారు. ఆగస్టు 15 కల్లా ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు ఇవ్వడమే తన చిరకాల కోరిక అన్నారు. గోదావరి జిల్లాల మాదిరిగా ఖమ్మం జిల్లాలో సాగు ఇవ్వాలన్నది తన లక్ష్యమని చెప్పారు. సీతారామ ప్రాజెక్ట్‌కు భూమి ఇచ్చిన వారికి పాదాభివందనాలు తెలిపారు. ఈ వర్షాకాలంలోనే లక్షన్నర ఎకరాలకు సాగునీరు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేయాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# అమావాస్య రోజుల్లో సూరజ్ ఎర్రచీర కట్టుకొని, నల్లగాజులు ధరించేవాడు

## -సిఐడి విచారణలో వెల్లడి



బెంగళూరు జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఓ యువకుడిపై ఎంఎల్‌సి సూరజ్ రేవణ్ణ అత్యాచార ఆరోపణల కేసులో విస్తుగొలిపే విషయాలు పోలీసుల విచారణలో వెలుగులోకి వస్తున్నాయి.

ఓ యువకుడిపై అత్యాచారా నికి పాల్పడిన ఆరోపణలపై సూరజ్ రేవణ్ణ అరెస్టైన విషయం తెలిసిందే. అమావాస్య రోజుల్లో సూరజ్ ఎర్రచీర కట్టుకొని, నల్లగాజులు ధరించేవాడని సిఐడి విచారణలో తేలింది. 2019 ఎన్నికల సమయంలో ఓ యువకుడికి అరకలగూడలో సూరజ్ పరిచయం కావడంతో తన ఫోన్ నంబర్ తీసుకొని విజిటింగ్ కార్డు ఇచ్చాడు.

ఫోన్ లో సదరు యువకుడికి గుడ్ మార్నింగ్‌తో పాటు పలుమార్లు ప్రేమ చిహ్నాలు పంపించేవాడు. ఒక రోజు సూరజ్ తన ఫామ్‌హౌస్‌కు ఆ యువకుడిని పిలిపించుకొని కాళ్లు ఒత్తమని కోరా డు. అనంతరం సూరజ్ బెదిరించి తనపై అత్యాచారం చేశాడని సిఐడి అధికారులకు యువకుడు తెలిపాడు. ఎర్రచీర, నల్లగాజులు వేసుకున్న ఫోటో లు ఆయన ఫోన్ లో ఉన్నాయని సదరు యువకుడు పోలీసుల విచారణలో వెల్లడించారు. ఆ ఫోన్ కోసం పోలీసులు వెతుకుతున్నారు. 2018లో సాగరిక అనే అమ్మాయిని సూరజ్ పెళ్లి చేసుకున్నాడు. భార్యను అసహజ లైంగిక కార్యకలాపాలు చేయాలని సూరజ్ బలవంతం చేశాడు.

దీంతో భార్య అతడి నుంచి విడాకులు తీసుకుందని న్యాయవాది కుమార్ ఎ పాటిల్ తెలి పారు. పెళ్లి జరిగిన కొన్ని నెలల దంపతులు విడాకులు తీసుకున్నట్టు సమా చారం. పలువురు మహిళలపై లైంగి క దాడి చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొం టున్న జెడిఎస్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ అరెస్టు ఐనా విషయం తెలిసిందే.

# చెట్టును ఢీకొన్న కారు..ముగ్గురు మృతి, ఐదుగురికి గాయాలు

అమరావతి, జూన్ 27 :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా వినుకొండ సమీపంలోని కొత్తపాలెం వద్ద ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. అనంతపురం-గుంటూరు జాతీయ రహదారిపై ఇవాళ తెల్లవారుజామున ఇన్నోవా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా.. మరో ఐదుగురు గాయపడ్డారు.

మృతులు గుంటూరుకు చెందిన వారిగా గుర్తించామని పట్టణ సీఐ సాంబశివరావు తెలిపారు. కర్ణాటకలోని బళ్లారి నుంచి గుంటూరుకు వెళుతుండగా ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నల్లగొండలో డాక్టర్ల ఆందోళన.. కలెక్టర్ ఉత్తర్వులపై మండిపాటు

## -ప్రత్యేక అధికారుల తనిఖీలపై అభ్యంతరం
## -విధులు బహిష్కరించిన వైద్యులు
## -అదనపు కలెక్టర్ చెప్పినా ససేమిరా

నల్గొండ, జూన్ 27 :ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించే బాధ్యత జిల్లా స్థాయి అధికారులకు అప్పగిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి జారీ చేసిన ఉత్తర్వులపై డాక్టర్లు మండిపడ్డారు. దీనికి నిరసనగా డాక్టర్లు విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు.



దీంతో ఆస్పత్రిలో గురువారం వైద్య సేవలు నిలిచిపోయాయి. ఆందోళనకు దిగిన వైద్యులను ఒప్పించడానికి అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర రావు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇంకా ఆందోళన కొనసాగుతోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తనిఖీ చేసేందుకు జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి నల్లగొండ ఆస్పతికి చేరుకున్నారు.

ఈ విషయం తెలుసుకున్న వైద్యులు ఆయన్ని అడ్డుకున్నారు. తమ సేవల పట్ల అనుమానం వ్యక్తం చేయడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీంతో జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి విషయాన్ని అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు తెలియజేశారు. హుటాహుటిన ఆయన ఆసుపత్రికి వచ్చి వైద్యులతో చర్చించారు. అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర వైద్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు తమ ఆందోళనను విరమించలేదు.

ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే ఉద్దేశంతోనే కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర చెప్పారు. అయినా వైద్యులు ససేమిరా అన్నారు. తాము ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు హెచ్ఓడీలకు, ఆసుపత్రి సూపరిండెంట్ కు చెబుతున్నామని వారి ద్వారా సమస్యలను పరిష్కరించవచ్చు కదా అని వైద్యులు ప్రశ్నించారు. ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర వెనుదిరిగారు.






# రక్తదానం మానవత్వం యొక్క నిజమైన ప్రతీక



హైదరాబాద్ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : రక్తదానం మానవత్వం యొక్క నిజమైన చర్య అని, ప్రమాదాల వల్లనైనా, మరే ఇతర కారణాల వల్లనైనా శరీరము ఎక్కువ పరిమాణములో రక్తాన్ని కోల్పోతే, ఆ లోటును రక్తంతో మాత్రమే భర్తీ చేయటం సాధ్యమవుతుంది అని మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సాయి చౌదరి అన్నారు. ప్రకాష్ నగర్ కాలనీలో మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్త దాన శిబిరం నిర్వహించారు.. ఈ సందర్భంగా సాయి చౌదరి మాట్లాడుతూ సరైన సమయంలో కనుక వారికి రక్తం ఇవ్వగలిగితే వారి విలువైన ప్రాణాలను కాపాడగలుగుతాం అని, ఒక్క ప్రమాదాలలోనే కాదు, అత్యవసర శస్త్ర చికిత్సలు, క్లిష్టమైన ప్రసవాలలో, అనేమియా వంటి తీవ్ర అనారోగ్య పరిస్థితులలో కూడా రక్తం అవసరం ఎక్కువగా ఉంటుంది అని, రక్తానికి ప్రత్యామ్నాయం లేదు అని, రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేము అని, అందువల్ల మనము చేసే రక్త దానమే వాళ్లకు ప్రాణదానంగా మారుతుంది అని మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సాయి చౌదరి అన్నారు

# కూతురును లైంగికంగా వేధించాడని భర్తను గొడ్డలితో నరికిచంపిన భార్య

సంగారెడ్డి జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స);: కూతురును లైంగికంగా వేధించాడని భర్తను భార్య గొడ్డలితో నరికిచంపిన సంఘటన సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?.. తండ్రి మద్యానికి బానిసగా మారి ప్రతి రోజు తల్లి, కూతురును వేధించేవాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో కూతురును తండ్రి లైంగికంగా వేధించాడు. ఈ విషయం తల్లికి కూతురు చెప్పడంతో గొడ్డలి తీసుకొని భర్తను నరికేసింది. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో తల్లీకూతుళ్లు లొంగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# కామ్రేడ్ ఎమ్ వి ప్రసాద్ వసంతక్కలు ఆశయాలను ముందుకు తీసుకుపోవాలి

## – ఐఎఫ్టియు ( శ్రామిక స్పందన) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ సుధాకర్ పిలుపు



ఆర్మూర్ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఆర్మూర్ మండల కేంద్రంలో లోసిపిఐ ఎంఎల్. చంద్ర పుల్లారెడ్డి పార్టీ అనుబంధ సంఘాలైన ఐఎఫ్టియు భారత రైతు కూలీ సంఘం . భారత ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ ఎమ్ వి ప్రసాద్ వసంతక్కలు 19వ వర్ధంతి సభ టీఎన్జీవో భవన్లో కామ్రేడ్ భారత రైతు కూలీ సంఘం. రాష్ట్ర కోశాధికారి బొట్ల రాజు. అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చిసిన ఐఎఫ్టియు ( శ్రామిక స్పందన) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ సుధాకర్ మా ట్లాడుతూ ఎన్ వి ప్రసాద్ వసంతక్కలు జీవిత సహచరులు వారు మరణించి నేటికి 19 సంవత్సరాలు పూర్తయినాయి. కామ్రేడ్ ప్రసాద్ నల్గొండ జిల్లాలోని మెల్ల దుప్పలపల్లి గ్రామంలో 1962లో జన్మించారు 1977.లో విప్లవ రాజకీయాలకు ఆకర్షితులైనారు విద్యార్థి సంఘంలో క్రియ శీలంగా వ్యవహరించారు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి నాయకత్వం న. కొనసాగుతున్న గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాల్లో బాగస్వామి. అయ్యాడు 1980లో సిపిఎంఎల్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా నాయకుడిగా అజ్ఞాత ఆత్మరక్షణ దళాలలో పనిచేశాడు తర్వాత కాలంలో పార్టీ ప్రజాసంఘాల అభివృద్ధి ఉద్యమ ప్రయోజనాల దృష్టిలో పెట్టుకొని లీగల్ ఉద్యమాలకు నాయకత్వం వహించారు ఏజెన్సీ కి దగ్గరలో ఉన్న మైదాన ప్రాంతాలైన సొల్లు పొడి బయ్యనపల్లి. తదితర గ్రామాల్లో భూ పోరాటాలు నిర్వహించాడు ఎన్నో నిత్యనిబంధాలు ఎదుర్కొన్నాడు భూ పోరాటాలను ప్రజా ఉద్యమాలను ఇతర మండలాలకు విస్తరింపజేశారు ఇలాంటి ఉద్యమ స్ఫూర్తితో ఎంతోమందిని విద్యార్థి యువకులను మహిళలను పార్టీ ప్రజాసంఘాల్లోకి పనిచేయడానికి ముందుకు వచ్చారు ఇలా. వచ్చిన గిరిజన మహిళలను రాజమణి అక్క అలియాస్ వసంతక్కను పార్టీ. ఆల్మట్టితో . వివాహం చేసుకున్నాడు ఆమెకు చదువును విప్లవ రాజకీయాలను నేర్పాడు సామాన్య పేద మధ్యతరగతి ప్రజలపై సమస్యలపై నాయకత్వం వహించి ముందుండి ఉద్యమించేలా వసంతక్కను క్రమశిక్షణ కలిగిన ఒక మహిళగా హక్కు మనిషిగా . తీర్చిదిద్దాడు ఇలాంటి నాయకులను కోల్పోవడం చాల. బాధాకరమని ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ సభలో భారత అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఇన్న సురేష. భారతం ప్రగశీల మహిళా సంఘంరాష్ట్ర ఉ పాధ్యక్షులు భాను బేగంభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులుబొట్ల గంగారం౹ఐ ఎఫ్ టు . ఆర్మూర్ మండల కన్వీనర్ శ్రీనివాస్ఆర్మూర్. పట్టణ కార్యదర్శి అబ్దుల్ భాయ్. జావీద్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు

# 'మిత్సుయి అండ్ కో లిమిటెడ్' ద్వారా స్నేహ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్లో నిర్దిష్ట ఈక్విటీ షేర్ల కొనుగోలుకు 'సిసిఐ' ఆమోదం

న్యూఢిల్లీ, జూన్ 27 : స్నేహ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (స్నేహ ఫార్మ్స్/ టార్గెట్)లో మిత్సుయి అండ్ కో లిమిటెడ్ (మిత్సుయి/అక్వైరర్) సంస్థ నిర్దిష్ట ఈక్విటీ షేర్లను కొనుగోలు చేసేందుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఆమోదం తెలిపింది.

ఈ లావాదేవీ– ప్రైమరీ సబ్స్క్రిప్షన్, సెకండరీ షేర్ల కొనుగోలు (ప్రతిపాదిత సమ్మేళనం)కు సంబంధించింది. ఈ మేరకు స్నేహ ఫార్మ్స్ నుంచి నిర్దిష్ట సంఖ్యలో ఈక్విటీ షేర్లను మిత్సుయి సంస్థ కొనుగోలు చేస్తుంది.

మిత్సుయి సంస్థ ఇన్వెస్ట్మెంట్ పోర్ట్ఫోలియోతోపాటు అత్యంత వైవిధ్య వ్యాపార నిర్వహణలో భాగంగా సార్వత్రిక ట్రేడింగ్ సేవలందించే కంపెనీ. ఈ సంస్థకు ప్రపంచంలోని 61 దేశాలు, ప్రాంతాల్లో అనుబంధ వాణిజ్య కార్యాలయాలున్నాయి. ఇది టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజ్లో నమోదై ఉంది. ఖనిజ–లోహ వనరులు, విద్యుత్తు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రవాణా, రసాయనాలు, ఇనుము–ఉక్కు ఉత్పత్తులు, ఆహారం–ఆహార చిల్లర వ్యాపార నిర్వహణ, ఆరోగ్యం, ఐటీ–కమ్యూనికేషన్లు, కార్పొరేట్ అభివృద్ధి వంటి వివిధ వ్యాపార రంగాలలో కార్యలాపాలు నిర్వహిస్తూంటుంది.

ఇక స్నేహ ఫార్మ్స్ 1994లో స్థాపించబడిన ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ. దీనికి స్నేహ గోల్డ్ ప్రోటీన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సింగ్ పౌల్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ అనే రెండు అనుబంధ సంస్థలు కూడా ఉన్నాయి. స్నేహ ఫార్మ్స్ ప్రధానంగా భారత పౌల్ట్రీ పరిశ్రమలో కార్యకలాపాలు నిర్వహిస్తూంటుంది. కోళ్ల పెంపకం నుంచి ఇతర ఉత్పత్తుల పంపిణీ వరకూ అనేక రకాల కార్యకలాపాలు చేపడుతూంటుంది. ఇందులో భాగంగా హేచరీల నిర్వహణ, పౌల్ట్రీ ఫీడ్ మిక్స్ల తయారీ, ఘనీభవన–శీతల చికెన్ తయారీ, వంట/వాడకానికి సిద్ధంగా ఉండే/ మేరినేట్ చేసిన పౌల్ట్రీ ఉత్పత్తులు మొదలైన వాటిని విక్రయిస్తూంటుంది. అలాగే చేపల మేత, పెంపుడు జంతువుల ఆహారం తదితరాలనుకూడా ఉత్పత్తి చేస్తుంది.

# రామోజీరావుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ల పుష్పాంజలి



విజయవాడ, జూన్ 27 : ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత రామోజీరావు సంస్మరణ సభకు పలువురు పాత్రికేయ, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. విజయవాడ శివారు కానూరులోని అనుమోలు గార్డెన్స్లో ఏర్పాటు చేసిన సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రామోజీరావు కుటుంబ సభ్యులు, ప్రముఖ పాత్రికేయులు ఎన్.రామ్, శేఖర్ గుప్తా, గులాబ్ కొఠారి, రాష్ట్ర మంత్రులు, సినీ ప్రముఖులు హాజరై రామోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.

పత్రికా రంగంతోపాటు వివిధ రంగాల్లో రామోజీరావు అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఆయన సంస్మరణ సభను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. వేదిక వద్ద రామోజీరావు జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను చంద్రబాబు, పవన్ కల్యాణ్ సహా ప్రముఖులు వీక్షించారు.

# ప్రాణాపాయంలో ఉన్న పసివాని వైద్యానికి వెస్సో ఆర్థిక సహాయం




భీమవరం జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి నివాసి గన్నవరపు నాగమోహన్ భరత్(34) అమెజాన్ డెలివరీ బాయ్ గా పనిచేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం భరత్ దంపతులకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మగ పిల్లవాడు జన్మించాడు. ఉమ్మనీరు మలినాలు ఊపిరితిత్తులకు చేరి గడ్డ కట్టడం వలన తీవ్ర శ్వాస సమస్య తలెత్తడంతో శిశువుకు భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి ఐసీయూలో వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నారు.

పసివాడి చికిత్సకు బంధు మిత్రులు మరియు స్థానికుల సహాయంతో ఇప్పటి వరకు సుమారుగా 3 లక్షలు ఖర్చు చేసారు. మరో 5 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా.

ఈ సందర్భంగా ఆర్థిక సహాయానికై భరత్ స్థానిక వెస్సో కార్యకర్తల ద్వారా వెస్సో సహాయాన్ని కోరారు. వెస్సో ట్రస్ట్ తరఫున స్థానిక వెస్సో కార్యకర్తలు గురజాపు బ్రహ్మాజీ గారు మరియు కొసనా వేంకటేశ్వర రావు గారు పసివాడి చికిత్సకు గౌరవ దాతల సహకారంతో రూ.88,500/–లు ఆర్థిక సహాయం భరత్ గార్కి అందజేసారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూజీవన్మరణ సమస్యతో పోరాడుతున్న పసివాడి వైద్యానికి ఆర్థిక సహాయం చేసి ఆదుకొన్న గౌరవ దాతలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# ఎంఓఆర్డి , ఎంఓపిఆర్ సహకారంతో కొత్త క్రిమినల్ చట్టాలపై రెండవ వెబ్నార్ను నిర్వహించిన మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ



న్యూఢిల్లీ, జూన్ 27 : గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్డి), పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ (ఎంఓపిఆర్) సహకారంతో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎండబ్ల్యుసిడి) ఈ రోజు రెండవ జాతీయ వెబ్నార్ను నిర్వహించింది. ఇటీవల అమలులోకి వచ్చిన క్రిమినల్ చట్టాలు : భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎన్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్ఏ) పై ఈ కార్యక్రమం దృష్టి సారించింది. ముఖ్యంగా మహిళలు, పిల్లల ప్రయోజనాల కోసం ఈ పరివర్తనాత్మక చట్టపరమైన మార్పుల గురించి దేశవ్యాప్త చైతన్యం, అవగాహన పెంచడానికి తీసుకున్న చొరవ ఇది. ఇటువంటి మొదటి వెబ్నార్ జూన్ 21,2024న నిర్వహించారు.

సమాజంలోని వివిధ వర్గాలలో మరింత వ్యాప్తి చెందించడానికి నేటి వెబ్నార్ ఉపయోగపడుతుంది. దీనిలో ఎంఓపిఆర్ కార్యదర్శి, ఎంఓడబ్ల్యుసిడి, ఎంఓఆర్డి జాయింట్ సెక్రటరీ ద్వారా ప్రారంభ ప్రసంగాలలో కొత్త చట్టాల ముఖ్య నిబంధనలను ప్రముఖంగా ప్రస్తావించారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (బీపీఆర్ అండ్ డి), ఎంఓడబ్ల్యుసిడి నిపుణులు, మహిళలు, పిల్లలపై ఈ చట్టాల సానుకూల ప్రభావాలపై లోతుగా వివరాలు అందించారు. వారి రక్షణ, గౌరవం, భద్రతకు సంబంధించిన అంశాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ సంస్థల నుండి ఎన్నికైన ప్రతినిధులు, ముఖ్యంగా మహిళా ప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, ఎంఓపిఆర్, ఎంఓడబ్ల్యుసిడి, ఎంఓఆర్డి నుండి వివిధ వాటాదారులతో సహా దాదాపు 50 లక్షల మంది వాటాదారులు పాల్గొన్నారు.

ఈ సంస్కరణ చట్టాల ఆమోదం భారతదేశంలోని మహిళలు, పిల్లల సాధికారత కోసం విధాన చట్రాన్ని బలోపేతం చేయడానికి ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా ఉంది.

# ఓమ్మి వ్యాన్ నడిపిన కెసిఆర్



హైదరాబాద్, జూన్ 27 :బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఓమ్ని వ్యాన్ నడిపారు. కొన్ని నెలల క్రితం కేసీఆర్ బాత్రూమ్లో జారి పడటంతో తుంటి ఎముక విరిగి ఆపరేషన్ అయిన విషయం తెలిసిందే. కాలు ఆపరేషన్ తరువాత కర్ర సహాయం లేకుండా నడుస్తున్న కేసీఆర్.. మ్యానువల్ కారు నడిపి చూడమని డాక్టర్ల సూచనల మేరకు తన ఫాం హౌజ్లో ఉన్న పాత ఓమ్ని వ్యాన్ నడిపారు. ఎవరి సహాయం లేకుండా వ్యాన్ ఎక్కిన ఆయన కొంత సేపు డ్రైవింగ్ చేశారు..

# ఆళ్లగడ్డలో 170 మంది పోలీసులతో భారీ బందోబస్తు..

అమరావతి, జూన్ 27 : ఆళ్లగడ్డ పట్టణంలో గురువారం గత రెండు రోజుల క్రితం హత్యకు గురైన అట్లశ్రీదేవి (55) అంత్యక్రియలు ఇవాళ జరుగుతున్న దృష్ట్యా 170 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు టౌన్ సిఐ రమేష్ బాబు తెలిపారు.జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నలుగురు సిఐలు, 9మంది ఎస్సైలు 170 మంది పోలీసు సిబ్బందితో భారీబందోబస్తు ఏర్పాటు చేసి గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు.

# “ప్రజా ప్రభుత్వం” అంటూ మాటలేమో కోటలు దాటుతున్నాయి

## – వార్షిక నివేదికలు విడుదల చేయాలి .. రేవంత్ సర్కార్పై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: “ప్రజా ప్రభుత్వం” అంటూ మాటలేమో కోటలు దాటుతున్నాయి.. ఎన్నుకున్న ప్రజలకు జవాబుదారీగా ఉండడానికి చేయాల్సిన పనులేమో అసలు మొదలేకావు అని బీఆర్ఎస్ పార్టీ మండిపడింది. వార్షిక నివేదికలు విడుదల చేసి, తమ చర్యల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యతను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం శోచనీయం అని పేర్కొంది. పాలనను పక్కనబెట్టి, చౌకబారు రాజకీయాలు చేయడమే ప్రధాన పనిగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం నుండి పారదర్శకతను, జవాబుదారీ తనాన్ని, ప్రతీ సంవత్సరం ఠంచనుగా వార్షిక నివేదికలను ఆశించడం అత్యాశే అవుతుంది అని పార్టీ పేర్కొంది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014 నుంచి 2023 వరకు ప్రతి ఏడాది ఐటి, పరిశ్రమలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్లలో సాధించిన పురోగతి వార్షిక నివేదికలను విడుదల చేయడం సంప్రదాయంగా కొనసాగింది. ఈ నివేదికలు ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు చేరువకు చేశాయి. ప్రతి ఏడాది జూన్ 2వ తేదీకి అటుఇటుగా వార్షిక నివేదికలను విడుదల చేసేవాళ్లం మని కేటీఆర్ ఎక్స్ వేదికగా గుర్తు చేశారు. ఈ విభాగాలు ఏడాది కాలంలో ఏం ప్రగతి సాధించాయనేది ప్రజలకు తెలియజేయడమే వార్షిక నివేదికల ఉద్దేశం అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రభుత్వాలు తమకు ఓటు వేసిన ప్రజలకు జవాబుదారీగా ఉంటాయన్నారు. రేవంత్రెడ్డి ప్రభుత్వం ఈ ముఖ్యమైన కార్యక్రమాన్ని విరమించుకోవడం, 2023–2024 వార్షిక నివేదికలను విడుదల చేయకపోవడం విచారకరం అని కేటీఆర్ పేర్కొన్నారు. “ప్రజా ప్రభుత్వం” అంటూ మాటలేమో కోటలు దాటుతాయి. ఎన్నుకున్న ప్రజలకు జవాబుదారీగా ఉండడానికి చేయాల్సిన పనులేమో అసలు మొదలేకావు. వార్షిక నివేదికలు విడుదల చేసి, తమ చర్యల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యతను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం శోచనీయం.

# నిమ్జ్ లో భూమిలేని వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం వెంటనే పునరావాసం కల్పించాలి.

## –2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిమ్స్ లో వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఆదుకోవాలి.



సంగారెడ్డి, జూన్ 27 :(నేటి నిజం ప్రతినిధి):నిమ్జ్ లో భూమిలేని వ్యవసాయ కూలీలకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు ఈరోజు నేషనల్ ఇన్వెస్ట్మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్) పరిధిలోని ఝరసంఘం మండలం బర్దిపూర్ గ్రామ వ్యవసాయ కూలీలు పునరవాసం కల్పించాలని కలెక్టరేట్ ఏవో పరమేశ్ గారికి మెమోరాండం ఇవ్వడం జరిగింది

ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్కల్, ఝరసంఘం మండలాల్లో 12,600 ఎకరాలను నిమ్జ్ కోసం ప్రభుత్వం భూములను సేకరిస్తుంది ఇప్పటికే రైతులు సరైన నష్టపరిహారం కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు కోసం అనుమతులు ఇస్తుంది దీంతో వ్యవసాయ కూలీలకు ఉపాధి లేకుండా పరిస్థితి ఏర్పడింది గత అనేక ఏళ్లుగా రైతుల వద్ద వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం నడుపుతున్నారు రైతుల భూములు లాక్కోవడంతో వ్యవసాయ కూలీలకు పని పోయింది. కూలీల కుటుంబాలు గడవని పరిస్థితి ఏర్పడింది గతంలో వ్యవసాయ కూలీలు హైకోర్టు ఆశ్రయిస్తే కూలీలకు న్యాయం చేయాలని హైకోర్టు తీర్పునిచ్చింది కానీ ఇప్పటివరకు ఏటువంటి చర్యలు ప్రభుత్వం చేపట్టలేదు ఎప్పటికైనా వ్యవసాయ కూలీలను పునరావాసం కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నష్టపరిహారం ఇండ్లు కట్టివ్వాలని పెన్షన్లు ఇవ్వాలని వస్తున్న పరిశ్రమలో వ్యవసాయ కూలీల కుటుంబాలనుంచి ప్రార్ధన ఇచ్చి ఉద్యోగాలు పెట్టుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తుందని అన్నారు లేని పక్షంలో వ్యవసాయ కూలీలందరిని సమీకరించి వారికి న్యాయం జరిగేం తవరకు పెద్ద ఎత్తున పోరాటం చేసామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబురావు వ్యవసాయ కార్మిక సంఘం ఝరసంఘం మండల నాయకులు మనోహర్ జయమ్మ బర్దిపూర్ గ్రామ వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు

# జిల్లా కేంద్రంలో భేటీ బచావో - భేటీ పడావో అవగాహన కార్యక్రమం.



సంగారెడ్డి, జూన్ 27 :(నేటినిజం ప్రతినిధి):గురువారము నాడు జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళ సాధికారత కేంద్రం అధ్వర్యంలో, భేటీ బచావో – భేటీ పడావో లో భాగంగా ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల సంగారెడ్డి లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమం లో ఆడపిల్ల ప్రాముఖ్యత చదువు మరియు విద్యా ఉద్యోగం ఆర్థిక అభివృద్ధి చట్టాలు మరియు వాటి శిక్షలు మానసిక ఒత్తిడి లను అధిగమించే పద్ధతులను గురించి వివరించడం జరిగింది. అదే విధంగా భ్రుణహత్యలను ఆపడానికి, క్షీణిస్తున్న లింగ నిష్పత్తిని అరికట్టడానికి ఉపయోగపడుతుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్సై నాగలక్ష్మి , హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ , కళాశాల ప్రిన్సిపల్ సుజాత ,జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి , మరియు విశాల మరియు కళాశాల సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలో 750 మంది విద్యార్థినులు పాల్గొన్నారు

# మోదీ నేతృత్వాన మా సంపూర్ణ ప్రభుత్వం లక్ష్యంవైపు సాగుతోంది: కేంద్ర హోంమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 27 : ‘‘అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం–అక్రమ రవాణా వ్యతిరేక దినం’’ నేపథ్యంలో దేశ ప్రజలకు కేంద్ర హోమ్–సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక ‘ఎక్స్’ ద్వారా పంపిన సందేశంలో– ‘‘అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం–అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా ప్రజలందరికీ నా శుభాకాంక్షలు. భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దే దిశగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని మా ప్రభుత్వం దృఢమైన నిబద్ధతను ప్రదర్శిస్తోంది. ఈ లక్ష్యం దిశగా ‘సంపూర్ణ ప్రభుత్వం’ విధానంతో ముందడుగు వేస్తోంది. మాదకద్రవ్య మహమ్మారి నుంచి దేశాన్ని విముక్తం చేయడంతోపాటు మన భవిష్యత్తరాలకు మెరుగైన ప్రపంచాన్ని కానుకగా ఇవ్వడంపై మన సంకల్పాన్ని మరింత దృఢంగా ప్రకటిద్దాం’’ అని పిలుపునిచ్చారు.

శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ‘మాదకద్రవ్య రహిత భారత్’ దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు. ఈ మేరకు ‘అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం–అక్రమ రవాణా వ్యతిరేక దినం’ నేపథ్యంలో పంపిన తన సందేశంలో: ‘మాదకద్రవ్య రహిత భారత్’ దిశగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పాన్ని సాకారం చేయడంలో నిర్విరామంగా శ్రమిస్తున్న ప్రభుత్వ సంస్థలు–సిబ్బందికి శ్రీ అమిత్ షా అభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా ‘అఖిలభారత మాదకద్రవ్య రహిత పక్షోత్సవాల’ను విజయవంతంగా నిర్వహించిన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సిబి)ని ఆయన ప్రశంసించారు.

మాదకద్రవ్యాలు వ్యక్తులతోపాటు యావత్ సమాజానికి, అంతిమంగా దేశ భద్రతకే సవాలు విసురుతున్నాయని శ్రీ అమిత్ షా గుర్తుచేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ‘మాదకద్రవ్య రహిత భారత్’ రూపకల్పన తమ ప్రభుత్వ అగ్ర ప్రాథమ్యాలలో ఒకటిగా ఉందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలపై పోరులో భాగంగా ‘దిగువ నుంచి ఎగువకు–ఎగువ నుంచి దిగువకు’ విధానం అమలులో మోదీ ప్రభుత్వం మెరుగైన సమన్వయం సాధించిందని ఆయన చెప్పారు.

మాదకద్రవ్యాలపై ‘సంపూర్ణ నిరోధం’ విధానంతో ముందడుగు వేస్తున్నామని కేంద్ర హోంమంత్రి తెలిపారు. ముఖ్యంగా మాదకద్రవ్య వ్యసనాన్ని పూర్తిగా నిర్మూలించడంపై ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. హోం మంత్రిత్వ శాఖ కృషితోపాటు ‘ఎన్సిఒఆర్డి’ ఏర్పాటు, రాష్ట్రాల పోలీసు విభాగాల్లో ‘యాంటీ నార్కోటిక్స్ టాస్క్ఫోర్స్’ ఏర్పాటుతో ఈ పోరాటం మరింత ఉధృతమై సానుకూల ఫలితాలిచ్చిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మాదకద్రవ్య నియంత్రణపై ప్రభుత్వం చేపట్టిన అన్నిరకాల సానుకూల చర్యలకు భారీ ప్రజా భాగస్వామ్యం తోడ్పాటుతో సంపూర్ణ విజయం సాధించడమే తమ లక్ష్యమని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ఆ మేరకు ‘‘మాదకద్రవ్యాలపై ప్రభుత్వ పోరాటానికి దేశ ప్రజలు తమవంతు సహకారం అందించాలని అభ్యర్థిస్తున్నాను. మనమంతా సమష్టి కృషితో మాదక ద్రవ్యాల సంపూర్ణ నిర్మూలన ద్వారా ఆరోగ్యకర.. సంతోషభరిత.. సురక్షిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేద్దాం రండి’’ అని పిలుపునిచ్చారు.

చట్టవిరుద్ధ మాదకద్రవ్య వ్యాపారం నిరోధం దిశగా కేంద్ర హోంశాఖ బహుముఖ కృషి ఫలితంగా స్వాధీనం చేసుకుంటున్న మాదకద్రవ్యాల పరిమాణం దాదాపు 100 శాతం పెరిగింది. అంతేకాకుండా ఈ అక్రమ కార్యకలాపాలపై కేసుల నమోదు 152 శాతం పెరిగింది. ఈ అంశాలపై మంత్రిత్వశాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం– దేశంలో 2006–13 మధ్య కాలంలో 1,257 కేసులు నమోదు కాగా, 2014–23 మధ్య 3 రెట్లు పెరిగి 3755 నమోదయ్యాయి. అలాగే అరెస్టులు కూడా 2006–13 మధ్య 1363 సంఘటనలు నమోదవగా, 2014–23 మధ్య కాలంలో 4 రెట్లు పెరిగి 5745కి చేరాయి. ఇక 2006–13 మధ్యకాలంలో 1.52 లక్షల కిలోల మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోగా, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో ఇప్పటిదాకా ఈ పరిమాణం రెట్టింపు పెరిగి 3.95 లక్షల కిలోలకు చేరింది. ఇలా స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ పరంగానూ 2006–13 మధ్య రూ.768 కోట్లు కాగా, మోదీ ప్రభుత్వ హయాంలో 30 రెట్లు పెరిగి రూ.22,000 కోట్లకు చేరింది.

అంతేకాకుండా మోదీ ప్రభుత్వ హయాంలో రూ.12,000 కోట్ల విలువైన 12 లక్షల కిలోల మాదకద్రవ్యాలను యాంటీ నార్కోటిక్ సంస్థలు ధ్వంసం చేశాయి. మరోవైపు 2023 జూన్ వరకూ ఇటువంటి 23 ఉదంతాల్లో రూ.74,75,00,531 విలువైన ఆస్తులను స్తంభింపజేశాయి.




